క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

జగిత్యాల: రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సంజయ్‌కుమార్‌ను పట్టణ ప్రైవేట్ పాఠశాలల యజమానులు ఘనంగా సన్మానించారు. పట్టణాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. మరింత అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు యాద రామకృష్ణ, కార్యదర్శి శ్యామ్, ట్రెజరర్ జీవన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మల్యాల: కొండగట్టు సబ్‌స్టేషన్ 33/11కేవీ లైన్‌లో ప్రత్యేక నిర్వహణ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలగనుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కొండగట్టు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కొండగట్టుతో పాటు సర్వాపూర్, బల్వంతాపూర్ గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

రాయికల్: పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల గ్రామాల్లో ఉండదన్నారు.

వసతులు కల్పించాలి

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతులు కల్పించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయ డీఏవోకు వినతి పత్రం అందజేశారు. కళాశాలలో వసతుల్లేక విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నగర కార్యదర్శి కాసిపాక అరవింద్, సంయుక్త కార్యదర్శి అభివెంకట్, సాయిచరణ్, విఘ్నేష్, సాయిరాం, మహేందర్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

గంగామాత జాతర ఉత్సవాలు



దర్శించుకుంటున్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: జగ్గాసాగర్‌లోని గంగామాత జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం అర్చకులు అభిషేకం, హోమం, గంగాగౌరి శివ కల్యాణం జరిపారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి ఉత్సవ మూర్తుల శోభాయాత్ర చేశారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్‌గా వెంకటస్వామి

ఇబ్రహీంపట్నం: గొడూర్ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎడపెల్లి వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం గ్రామంలో అన్ని కుల సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్‌గా సామ ప్రవీణ్, కోశాధికారిగా రాగుల మధు, రైటర్‌గా దివాకర్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వెంకటస్వామి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

టీఆర్టీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



సురేశ్



శ్రీనివాస్‌గౌడ్

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుంగూరి సురేశ్, కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, సతీశ్, గోవర్దన్, చిన్నయ్య, విజయనందరావు, గంగాధర్, పవన్‌కుమార్, సాయికృష్ణ, భీమనాథ్‌ను ఎన్నుకున్నారు. పరిశీలకులుగా రమేశ్, రాంప్రసాద్ వ్యవహరించారు.

15న సర్వసభ్య సమావేశం

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న మండల అధ్యక్షుడు పాలెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. సభ్యులందరూ ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు.

కథలాపూర్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ జవ్వాజి రేవతి తెలిపారు.

రక్త నిర్ధారణ పరీక్షలు

రాయికల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గోపా మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం 100 మంది విద్యార్థులకు రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బత్తిని నిరంజన్, జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్, కైరం రమణ, గుగ్గిళ్ల రాము, శ్రీధర్, రవీందర్ పాల్గొన్నారు.

రక్తదానం

రాయికల్: ఇటిక్యాల గ్రామానికి చెందిన నవ్య అనే గర్భిణికి అత్యవసరంగా ఓ నెగిటివ్ రక్తం అవసరం ఉండగా.. గురువారం సామల్ల వేణు రక్తదానం చేశారు.

కాలువకు గండి.. అందని నీళ్లు

- ఇదీ రాళ్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు పరిస్థితి
- యాసంగి పంటల సాగుపై రైతుల ఆందోళన



నీళ్లు లేక వెలవెలబోతున్న ప్రాజెక్టు కుడి కాలువ



భూషణరావుపేట శివారులో రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు గండి పడిన స్థలం ఇదే..



రాళ్లవాగు ప్రాజెక్టు

కథలాపూర్: రాళ్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పరిస్థితి విచిత్రంగా ఉంది. నిజామాబాద్–జగిత్యాల జిల్లాల సరిహద్దులో కథలాపూర్ మండలం భూషణరావుపేట శివారులో గల రాళ్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లున్నా ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. ప్రాజెక్టు కుడి కాలువకు గండి పడి నెల రోజులైనా మరమ్మతు గురించి పట్టించుకునేవారు కరువయ్యారని రైతులు మండిపడుతున్నారు. ఈ యాసంగిలో పంటలు సాగు చేసుడెట్లా అని ఆందోళన చెందుతున్నారు.

3,500 ఎకరాలకు..

రాళ్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లుంటే నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్, కథలాపూర్ మండలం భూషణరావుపేట, ఊట్‌పెల్లి, కథలాపూర్, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామాల పరిధిలోని 3,500 ఎకరాలకు నీళ్లందించడం లక్ష్యం. ఈ ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసిన విషయం అందరికి తెలుసు. భూషణరావుపేట శివారులో కుడి కాలువకు గండి పడటంతో మరమ్మతుల ఊసే ఎత్తడం లేదని, యాసంగిలో పంటలు సాగు చేసుడెట్లా అని అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ చూపి రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు పడిన గండిని త్వరగా మరమ్మతులు చేయించి ఆయకట్టు భూములకు నీళ్లందించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు గండి పడిన స్థలాన్ని పరిశీలించాం. శాశ్వత మరమ్మతుల కోసం రూ.23లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. ప్రతిపాదనల ఫైల్ ఈఎన్సీ పరిధిలో ఉంది. నిధులు మంజూరైతే పనులు చేయిస్తాం.

– శేఖర్, ప్రాజెక్టు పరిధి ఏఈఈ(కమ్మర్‌పెల్లి)

సాగు సగమే..



ప్రతిసారి 8 ఎకరాల్లో వరి పంట ఏసినం. రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు గండి పడింది. కాలువ ద్వారా నీళ్లు వస్తాయో లేదోనని 4 ఎకరాల్లో వరి పంట ఏసిన. కాలువకు గండి పడి నెల రోజులు దాటినా మరమ్మతుల గురించి గింత నిర్లక్ష్యం చేయడం దారుణం. నీళ్లు లేక పంటలు సాగు చేయడం కష్టమని అందరికి తెలిసినా పట్టించుకోలేదు. అధికారులు స్పందించి కాలువకు పడిన గండిని పూడ్చేయించాలి.

– బోద మాధవరెడ్డి, ఆయకట్టు రైతు

శాశ్వత పరిష్కారం చూపాలి



కుడి కాలువకు ప్రతి ఏటా గండి పడుతోంది. అధికారులు పరిశీలించి తాత్కాలికంగా మరమ్మతు చేయించి చేతులు దులుపుకుంటున్నారు. కాలువకు గండి పడకుండా శాశ్వత పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి. రాళ్లవాగు ప్రాజెక్టులో నీళ్లుంటే ఐదు గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది. అటువంటి ప్రాజెక్టుపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా చొరవ చూపాలి.

– గడ్డం దేవారెడ్డి, రైతు, భూషణరావుపేట

కార్యవర్గం ఎన్నిక



గంగుల రణధీర్



లక్ష్మీకాంతం

కోరుట్లరూరల్: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ కోరుట్ల మండల శాఖ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగుల రణధీర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.లక్ష్మీకాంతం, ఉపాధ్యక్షులుగా జి.భూమేశ్వర్, జి.శ్రీలలిత, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.సత్యనారాయణ, జాయింట్ కార్యదర్శులుగా డి. రాజేందర్, ఎ.సరళ, ఎస్.భవాని, జిల్లా కౌన్సిలర్లుగా తాడూరి సతీష్‌గౌడ్, గోరుమంతుల మూర్తి, ఆర్.పవన్‌కుమార్, సి.రాజగంగారాం, కోరుట్ల రాజ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: మొగిలిపేటలో గురువారం నిరుపేద ముస్లిం కుటుంబానికి బీజేపీ నాయకులు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన అబిబ్‌ఖాన్ ఆటో నడుపుతూ జీవనాన్ని కొనసాగిస్తుండగా.. కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మూడు రోజుల క్రితం మృతిచెందాడు.

కాంగ్రెస్ సంబరాలు



తుంగూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

సారంగాపూర్: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేసిన సందర్భంగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు. స్వీట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, రంగు లక్ష్మణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండ్ర రాంచంద్రారెడ్డి, గుడిసె జితేందర్, చెర్పూరి సుభాష్, చిక్కల్ల రవి, చుంచు అభిలాష్, ఎనగంటి సతీష్, పాంపర్తి రంజిత్, సూద శరత్, తాడుక మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్లూరిని కలిసిన నాయకులు

పెగడపల్లి: ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పెగడపల్లి కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణరెడ్డి, కిషన్, తిరుపతి, రవి, రాజు, భాస్కర్, ప్రశాంత్, శ్రీధర్‌రావు, అంజయ్య, రామగౌడ్, రాజేశంగౌడ్, శ్రీనివాస్, ప్రవీణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తరలిన నాయకులు

మేడిపల్లి: రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి వెళ్తున్నట్లు మేడిపల్లి, భీమారం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు మేరకు రెండు మండలాల నుంచి భారీగా తరలివెళ్లారు. మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మోత్కురావుపేట సర్పంచ్ లక్ష్మినర్సయ్య, ఉపసర్పంచ్ గంగారెడ్డి, మల్లేశం, కొమురయ్య, సయ్యద్, మిట్టపెల్లి రాజరెడ్డి, ఉరుమట్ల లక్ష్మణ్, మధు,దామోదర్, ఆదిరెడ్డి, చుక్క తిరుపతి, జీవన్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గురువారం ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బ్లాక్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, నాయకులు యామ రాజయ్య, పాలెపు నీల, షేక్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం

ధర్మపురి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడం ఎంతో అభినందనీయమని కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి జాజాల రమేశ్ అన్నారు. నేరెల్ల గ్రామంలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. నాయకులు జంగిలి తిరుపతి, మల్లేశం, అజయ్, మహేశ్, నరేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్‌లో..

రాయికల్: సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో రాయికల్‌లో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించి టపాసులు కాల్చారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, జిల్లా యూత్ నాయకులు మహిపాల్‌రెడ్డి, షాకీర్, రాకేశ్, మండల నాయకులు నర్సింహారెడ్డి, గంగాధర్, ఖలీల్, సతీశ్ పాల్గొన్నారు.

లక్ష్మణ్‌కుమార్‌ను కలిసిన నాయకులు

గొల్లపల్లి: ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గొల్లపల్లి మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిదులు, నాయకులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సర్పంచులు చిర్ర గంగాధర్, రేవెల్లి సత్యనారాయణ, రాజ్యలక్ష్మి తిరుపతి, వెంకటి పద్మ వెంకటేష్, కాసారపు అరవింద్‌గౌడ్, నాయకుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజ

కోరుట్ల: పట్టణానికి చెందిన అల్లె నారాయణ గురుస్వామి ఇంట్లో గురువారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప ఆలయ గౌరవ అధ్యక్షుడు, గురుస్వామి చిదురాల నారాయణ స్వామి 18వసారి దీక్ష తీసుకున్న స్వామి అల్లె నారాయణకు నారికేళం, ధర్మ దండాన్ని అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాలెపు రాముశర్మ, గురుస్వాములు, స్వాములు పాల్గొన్నారు.

రూ.3లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: భూషణరావుపేటలో అంబేద్కర్ మాదిగ సంఘం భవనం కోసం రూ.3లక్షల ప్రొసీడింగ్ కాపీని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి గురువారం సంఘం సభ్యులకు అందించారు. సంఘం సభ్యుల విన్నపం మేరకు మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మినరసింహారావు ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించారన్నారు. నిధులు మంజూరు పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు బద్దం మహేందర్, ముస్కు శ్రీనివాస్, శనిగారపు గణేశ్, వంగరి రాజు తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టు కార్యక్రమంతో మంచి ఫలితాలు



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోందని మండల నోడల్ అధికారి కేతిరి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం రాఘవపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. తొలిమెట్టు కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారి ప్రోత్సాహాన్ని పొందాలన్నారు. మహేష్, సతీష్, దేవరెడ్డి, మహేశ్, విజయ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస సామర్థ్యాలు మెరుగుపరచాలి

కథలాపూర్: ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈవో ఆనందరావు అన్నారు. గురువారం కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ ప్రాథమిక పాఠశాలల స్థాయి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారి లోకిని శ్రీనివాస్, సీఆర్పీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సారంగాపూర్: సైబర్ నేరగాళ్లతో విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మీ సమాచారం ఇవ్వాలని, మీ అకౌంట్ వివరాలందిస్తే డబ్బులు జమ చేస్తామని మీ ఫోన్‌లో ప్రకటనలు చేస్తారని, ఓటీపీ చెప్పాలని కోరితే పోలీసులకు వెంటనే సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ సేపదార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత



గుంత పూడ్చుతున్న జీపీ సిబ్బంది

సాక్షి స్పందన

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నుంచి గొధూర్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఇబ్రహీంపట్నం శివారు డీ–24 కాలువ వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికన ఈనెల 2న సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం గ్రామ పంచాయతీ సిబ్బందితో గుంతను పూడ్చివేయించారు.

సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి



వినతి పత్రం ఇస్తున్న విరాట్‌నగర్ కాలనీవాసులు

కోరుట్ల: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో బ్రహ్మంగారి ఆలయ సమీపంలో నిర్మిస్తున్న సెల్ ఫోన్ టవర్ నిర్మాణ పనులను ఆపాలని కోరుతూ విరాట్‌నగర్ కాలనీవాసులు గురువారం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. సెల్ టవర్ నిర్మాణంతో ఈ ప్రాంతంలో నివసించే సుమారు 500 కుటుంబాలకు రేడియేషన్ ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పెగడపల్లి: శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీవో మహేందర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వెంగళాయిపేట, నంచర్ల, పెగడపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. మురుగు కాలువలు, వన నర్సరీలు, వైకుంఠధామాలను పరిశీలించారు. వాటి నిర్వహణపై ఆరా తీశారు. పచ్చదనం, పరిశుభ్రతతో పాటు ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు కిరణ్, ప్రవీణ్ ఉన్నారు.

కిడ్నీ బాధితుడికి చేయూత



సాయమందిస్తున్న సేవాసమితి సభ్యులు

జగిత్యాలటౌన్/మల్యాల: రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్న హన్మయ్య కుటుంబానికి సత్యసాయి సేవాసమితి అండగా నిలిచింది. మల్యాల మండలం తక్కల్లపల్లి గ్రామానికి చెందిన దూల హన్మయ్య రెండు కిడ్నీలు చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతుండగా.. విషయం తెలుసుకున్న సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ స్పందించారు. దాతల సహకారంతో సేకరించిన రూ.16,500, ఆ కుటుంబానికి కావాల్సిన వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, బ్లాంకెట్లు, చెద్దర్లు తదితర వస్తువులు తక్షణ సాయంగా గురువారం అందజేశారు. సత్యసాయి సేవాసమితి పూర్వ కన్వీనర్ చిటుమల్ల లక్ష్మీనారాయణ, సభ్యులు కోటగిరి మహేందర్, అనంతుల అశోక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మేడిపల్లి: మేడిపల్లి, భీమారం మండలాల్లో నాలుగు రోజులుగా తుపాను ప్రభావం వల్ల వరిధాన్యం కొనుగోళ్లు నెమ్మదించాయని, సెంటర్లలోనే ధాన్యం నిల్వలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేడిపల్లి మండల వైఎస్సార్ టీపీ అధ్యక్షుడు వినయ్‌రెడ్డి అన్నారు. మళ్లీ నార్లు పోసి 15రోజులకు పైనే అయ్యిందని, ఇంకో 10 రోజుల్లో వరినాట్లు ప్రారంభమవుతాయని, కాని ఇంకా సెంటర్లలోని ధాన్యం పూర్తయ్యేలా లేదన్నారు.